సాక్షి కామారెడ్డి


సోమవారం । 24 । మార్చి । 2025



బంజార భవన్ నిర్మిస్తాం

జుక్కల్ నియోజకవర్గంలో బంజార భవన్ నిర్మిస్తామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు హామీ ఇచ్చారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
37.4 /20.8

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మోడల్ హౌస్ పరిశీలన



మోడల్ హౌస్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీడీ విజయపాల్‌రెడ్డి

లింగంపేట : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను హౌసింగ్ డిపార్ట్‌మెంట్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ విజయపాల్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో మోడల్ హౌస్‌ల నిర్మాణం కొనసాగుతోందన్నారు. కొన్ని మండలాల్లో స్లాబ్ లెవల్‌లో, మరికొన్ని మండలాల్లో రూఫ్‌లెవల్‌లో పనులు ఉన్నాయని పేర్కొన్నారు. మోడల్ హౌస్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు. ఆయన వెంట డీఈ శుభాష్, ఏఈ అశోక్, ఎంపీడీవో నరేష్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు



సాధించిన పతకాలతో క్రీడాకారులు

కామారెడ్డి అర్బన్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు బి.ఈశ్వర్‌ప్రసాద్, ఎల్.సునీత సత్తాచాటారు. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన జావెలిన్ త్రో అండర్–20 విభాగంలో ఈశ్వర్‌ప్రసాద్ రజత పతకం సాధించగా.. 400 మీటర్ల పరుగు పందెం అండర్–18 విభాగంలో సునీత కాంస్య పతకం సాధించారు. ఈ విషయాన్ని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులతోపాటు కోచ్ నవీన్‌కుమార్, మేనేజర్ అనిల్‌లను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

పోచమ్మ ఆలయం వద్ద ఉద్రిక్తత



పోచమ్మ ఆలయం వద్దనున్న మర్రి చెట్టు కొమ్మలను నరికేసిన దృశ్యం

భిక్కనూరు: పోచమ్మ ఆలయం వద్దనున్న మర్రిచెట్టును నరికేందుకు కొందరు యత్నించగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలిలా ఉన్నాయి. భిక్కనూరు దళితవాడ సమీపంలో పోచమ్మ ఆలయం ఉంది. భక్తులు ఏటా ఈ ఆలయం చుట్టూ ఎడ్ల బండ్ల ప్రదర్శన నిర్వహించి, అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. ఆ స్థలాన్ని కొనుగోలు చేశామంటూ ఆదివారం కొందరు వ్యక్తులు ఆలయం వద్దనున్న మర్రిచెట్టు కొమ్మలను నరకడం ప్రారంభించారు. దీనిని గమనించిన స్థానికులు వారిని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అన్య మతస్తులు ఆలయానికి సంబంధించిన మర్రిచెట్టును తొలగించేందుకు కుట్రచేశారని స్థానికులైన దళితులు ఆరోపిస్తున్నారు. అనంతరం ఆలయానికి సంబంధించిన భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.



మైలారంలో కంకర రోడ్డుపై దుమ్ముతో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

దారికి రాని పనులు



బీబీపేట నుంచి రాంరెడ్డిపల్లి మార్గంలో కంకర తేలిన రోడ్డు

సాక్షి ఫోకస్ SAKSHI FOCUS

రోడ్లు, రవాణా సౌకర్యాలు మెరుగుపడితేనే అభివృద్ధికి బాటలు పడతాయి. అందుకే ప్రభుత్వాలు రోడ్ల నిర్మాణాలకు, అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుంటాయి. అవసరానికి అనుగుణంగా మట్టి రోడ్లను కంకర రోడ్లుగా.. తారు రోడ్లుగా.. డబుల్ రోడ్లుగా అభివృద్ధి చేస్తుంటాయి. అయితే నాలుగైదేళ్లుగా రోడ్ల నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరైనప్పటికీ బిల్లుల చెల్లింపుల్లో తలెత్తిన సమస్యలతో చాలామంది కాంట్రాక్టర్లు పనులను మధ్యలోనే ఆపేశారు. కొన్ని కొత్త పనులు మంజూరైనా చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ప్రజల రవాణా కష్టాలు తీరడం లేదు. **జిల్లాలో రోడ్ల పరిస్థితిపై 'సాక్షి' ఫోకస్..**

- రోడ్ల నిర్మాణానికి బిల్లుల గ్రహణం
- చాలాచోట్ల మధ్యలోనే ఆగిన పనులు
- బిల్లులు రాక చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు
- నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులెన్నో..
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తారుకు నోచుకోని సర్దాపూర్ తండా - కొత్తగూడెం తండా రోడ్డు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాలో చాలా ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు మధ్యలో నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లను అభివృద్ధి చేసే క్రమంలో కొన్నిచోట్ల కంకర పరిచి వదిలేశారు. దుమ్ము లేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా కోర్టు, జిల్లా పరిషత్, ఆర్డీవో కార్యాలయాల వద్ద కంకర పరిచి ఏళ్లు గడుస్తోంది. మున్సిపల్, రోడ్లు భవనాలు, రైల్వే శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఈ పనులు ముందుకు సాగడం లేదు. రోడ్లు భవనాల శాఖ ద్వారా పాత బస్టాండ్ నుంచి పంచముఖి రైల్వే గేట్, అడ్లూర్ మీదుగా పోసానిపేట వరకు వెళ్లే రహదారి విస్తరణకు మూడేళ్ల క్రితం రూ.2 కోట్లు మంజూరవగా, పంచముఖి హనుమాన్ ఆలయం సమీపంలో డ్రెయినేజీపై వంతెన నిర్మించారు. అయితే వంతెనపై తారు వేయలేదు. ఈ రోడ్డు విస్తరణకు రాజకీయ గ్రహణం పట్టింది. జిల్లా కేంద్రంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తిరిగే రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల రోడ్ల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది.

■ కామారెడ్డి నుంచి రామారెడ్డి మీదుగా రెడ్డిపేటకు వెళ్లే రహదారిపై మద్దికుంట శివారులో అటవీ అనుమతులు రాక పనులు ఆగిపోయాయి. ఈ మార్గంలో ప్రయాణించేవారు ఇబ్బందిపడుతున్నారు.

■ లింగంపేట మండలం నాగారం శివారులో వంతెన నిర్మించినా, గతేడాది వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. తాత్కాలికంగా మొరం పోసి వదిలేశారు. వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

■ పిట్లం మండల కేంద్రంలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయాయి. పిట్లం నుంచి మద్దెలచెరువు, పిట్లం నుంచి కుర్తి వెళ్లే రోడ్లు అధ్వానంగా మారాయి.

■ తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి శివారులో వాగుపై వంతెన నిర్మించి రోడ్డుపై తారు వేయకుండా వదిలేశారు.

■ దోమకొండ మండల కేంద్రం నుంచి ముత్యంపేట వరకు బీటీ రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి.

■ మాచారెడ్డి మండలం మైసమ్మచెరువు తండా నుంచి తడ్కపల్లి వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరైనా అటవీ అనుమతులు లేక పనులు ఆగిపోయాయి.

■ బిచ్కుంద నుంచి కందార్‌పల్లి రోడ్డు అధ్వానంగా తయారైంది.

■ రాజంపేట మండల కేంద్రం నుంచి మెదక్‌కు వెళ్లే రహదారిపై కొండాపూర్ శివారులో వంతెన నిర్మించినా రోడ్డుపై తారు విస్మరించారు.

■ బాన్సువాడ మండలంలోని కోనాపూర్ – కాద్లాపూర్ రోడ్డు కంకర తేలి అధ్వానంగా ఉంది.

■ ఇబ్రహీంపేట్ పంచాయతీలోని రేకుల కుంట తండాకు రోడ్డు కోసం కంకర వేసి ఏడాది అవుతున్నా తారు వేయలేదు.

■ పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజని గ్రామం నుంచి శివాపూర్ వెళ్లే రోడ్డుపై మూడేళ్ల క్రితం కంకర పోసి వదిలేశారు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలతో విపరీతంగా దుమ్ములేస్తోంది. ఇలా జిల్లాలో చాలాచోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆయా మార్గాలలో ప్రయాణిస్తున్నవారు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కంకర రాళ్లతో వాహనాల టైర్లు దెబ్బతింటున్నాయని, వాహనాలు చెడిపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు స్పందించి నిలిచిన పనులను పూర్తి చేయించాలని కోరుతున్నారు.

పంచాయతీరాజ్ పరిధిలోని రోడ్ల వివరాలు.. (కి.మీ.లలో)

బీటీ రోడ్లు	మెటల్ రోడ్లు	సీసీ రోడ్లు	మట్టి రోడ్లు
769.19	379.50	178.15	946.84

ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న రోడ్ల వివరాలు.. (కి.మీ.లలో)

రాష్ట్రీయ రహదారులు	66.00
ప్రధాన జిల్లా రహదారులు	230.80
ఇతర జిల్లా రహదారులు	252.48
జెడ్పీ బదలాయించిన రోడ్లు	98.34
పీఆర్ బదలాయించిన రోడ్లు	274.83

బిల్లులు రాకపోవడమే సమస్య

కాంట్రాక్టర్లకు బిల్లులు రాకపోవడంతో వారు పనులను మధ్యలోనే ఆపేశారని స్పష్టమవుతోంది. జిల్లాలో వివిధ పథకాల ద్వారా చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 30 కోట్లకుపైగా బిల్లులు రావాల్సి ఉందని తెలుస్తోంది. కాంట్రాక్టర్లు ఎవరిని కదిలించినా ఏళ్లుగా బిల్లులు రావడం లేదని, ఎక్కడి నుంచి తెచ్చి పెట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం ఉండడం లేదని పేర్కొంటున్నారు. పాత బిల్లులు రాకపోవడంతో కొత్తగా మంజూరైన పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.



బ్రాహ్మణపల్లి-దేవాయిపల్లి రూట్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు



పిట్లంలో రోడ్డు విస్తరణలో కంకరవేసి వదిలేసిన దృశ్యం

ఆశే ఊపిరి



భవనంపై పెరుగుతున్న టమాట మొక్క

బతకాలనే ఆశ ఉండాలే కానీ ఎంతటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని నిలబడే శక్తి లభిస్తుంది అనడానికి ఈ చిత్రంలో కనిపిస్తున్న టమాట మొక్క ఓ ఉదాహరణ. స్లాబ్‌పైకి విత్తనం ఎలా చేరిందో కానీ.. మట్టి ఆసరా లేకుండానే మొలకెత్తింది. ట్యాంక్ ఓవర్ ఫ్లో అయినప్పుడు పారిన నీటిని ఆధారంగా చేసుకుని పెరిగింది. ఇప్పుడు ఏకంగా కాయలు కాస్తోంది. జిల్లాకేంద్రంలోని ఓ భవనంపై కనిపించిన ఈ మొక్కను 'సాక్షి' కెమెరాలో బంధించింది. – కామారెడ్డి క్రైం

మళ్లీ గ్రామాలలో రెవెన్యూ సేవలు

- జిల్లాలో 220 రెవెన్యూ క్లస్టర్లు
- క్లస్టర్‌కో గ్రామ పాలనాధికారి..
- పాత వీఆర్వోలు, వీఆర్‌ఏలతో భర్తీకి చర్యలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రెవెన్యూ వ్యవస్థను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడంలో భాగంగా ప్రభుత్వం గ్రామ పాలనాధికారులను నియమించనుంది. దీనికి సంబంధించి ఉత్తర్వులు కూడా వెలువరించింది. రెవెన్యూ క్లస్టర్‌కు ఒక గ్రామ పాలనాధికారిని నియమించనున్నారు. దీంతో జిల్లాలో 220 రెవెన్యూ క్లస్టర్లకు గ్రామ పాలనాధికారి రానున్నారు.

గతంలో ప్రభుత్వం వీఆర్వో, వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేసి.. అక్కడ పనిచేసిన వారినందరినీ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో గ్రామాల్లో భూములకు సంబంధించిన వ్యవహారాలు చూసే వారు లేకుండాపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వం గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా క్షేత్ర స్థాయిలో గ్రామ పాలనాధికారి పేరుతో పోస్టులను సృష్టించింది. గతంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసినవారికి ఆప్షన్ ఇచ్చి ఈ పోస్టులలో నియమించాలని యోచిస్తోంది. జిల్లాలో 536 గ్రామ పంచాయతీలు ఉండగా 474 రెవెన్యూ గ్రామాలున్నాయి. రెవెన్యూ క్లస్టర్లు మాత్రం 220 ఉన్నాయి. గతంలోలాగా రెవెన్యూ క్లస్టర్‌కు ఒక అధికారిని నియమించనున్నారు. రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై తెలంగాణ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరాలే సుధాకర్‌రావ్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామ రెవెన్యూ అధికారులను గ్రామ పాలనాధికారిగా ఎలాంటి షరతులు లేకుండా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆస్తుల విభజనలో ఈ–పంచాయితీ

పోర్టల్‌లో సాంకేతిక లోపాలు

- అసెస్‌మెంట్‌లో బ్లాక్‌నంబర్ తప్పుగా వస్తున్న వైనం
- అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు

దోమకొండ : ఈ –పంచాయతీ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆస్తుల పంపకం చేసుకుంటున్న సమయంలో అసెస్‌మెంట్‌లో బ్లాక్‌నంబర్ తప్పుగా రావడంతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం ఉండడంలేదు. గ్రామపంచాయతీతో సంబంధం లేకుండా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మ్యూటేషన్ ప్రక్రియతో పాటు అసెస్‌మెంట్ నంబరు కేటాయించడంతో ఈ సమస్య తలెత్తుతున్నట్లు తెలుస్తోంది. గతంలో పంచాయతీ డిమాండ్ రిజిస్టర్‌తో పాటు ధ్రువీకరణ పత్రం, ఇంటి రసీదుతో అసెస్‌మెంటు నంబర్లు తప్పుగా నమోదైతే వాటిని జీపీ కార్యదర్శి రివిజన్ రిజిస్టర్ ఆధారంగా సరిదిద్దేవా రు. కానీ ప్రస్తుతం సంబంధిత వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్ లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడంలేదు.

బ్లాక్ మారడంతో..

ప్రభుత్వం గ్రామాల్లో ఇంటి నిర్మాణం, ఇతరత్రా అనుమతుల ప్రక్రియను పారదర్శకంగా చేపట్టేందుకు ఈ–పంచాయతీ పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. సిటిజన్ లాగిన్ అనుమతులతో పాటు ఇతరత్రా అవసరాలకు లబ్ధిదారులు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఖాళీ స్థలాలు, ఇళ్ల వంటి ఆస్తులను పంపకాలు చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకునేప్పుడు మ్యూటేషన్ ప్రక్రియ ఇక్కడే పూర్తవుతోంది. కానీ సాంకేతిక సమస్యల కారణంగా బ్లాక్ మారి అసెస్‌మెంట్ నంబర్ కేటాయింపు జరుగుతోంది.

బీబీపేటకు చెందిన రాజయ్య అనే వ్యక్తికి చెందిన స్థలాన్ని ఆయన ఇద్దరు కుమారులు పంచుకుని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. పెద్దకుమారుడికి ప్రస్తుతం స్థలానికి ఉన్న ఇంటి నంబర్‌ను అసెస్‌మెంట్ ఆధారంగా కేటాయించారు. అదే నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకున్న చిన్నకుమారుడికి బ్లాక్ మారి అసెస్‌మెంట్ తప్పుగా వచ్చింది. చిన్న కుమారుడు ఇంటి నిర్మాణం అనుమతి కోసం గ్రామ పంచాయతీకి వెళ్లగా పంచాయతీ అధికారులు అసెస్‌మెంట్ తప్పుగా వచ్చిందంటూ అనుమతి నిరాకరించారు. దీంతో సమస్య పరిష్కారం కోసం ఆయన ఇటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం.. అటు పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఈ సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నట్లు తెలుస్తోంది.



దోమకొండలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ఇష్టారాజ్యంగా నమోదు..

వ్యవసాయేతర భూములు, వ్యవసాయ భూముల ఆస్తుల రిజిస్ట్రేషన్లను ధరణి పోర్టల్ ప్రామాణికంగానే నిర్వహించాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం పంచాయతీల్లో ఎన్పీబీ (నాన్ ప్రాపర్టీ బుక్)లో ఇళ్లతో పాటు వ్యవసాయేతర భూముల వివరాలను నమోదు చేయించింది. ఈ సమయంలో పంచాయతీ డిమాండ్ రిజిస్టర్‌తో సంబంధం లేకుండా గ్రామాలు, పట్టణాల్లో జనాభా ఆధారంగా ఇళ్లు, ప్లాట్ల సంఖ్యను నిర్దేశించి నమోదు చేయాలని సూచించారు. అయితే అప్పట్లో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఇళ్లతో పాటు వ్యవసాయేతర ప్లాట్లకు అసెస్‌మెంట్ నంబర్లను కేటాయించారు. ఈ నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశాక, నిర్దేశిత పోర్టల్‌ను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుసంధానం చేశారు. అప్పట్లో సరిగా నమోదు చేయకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

ఉన్నతాధికారులకు వివరించాం



ఆస్తుల పంపకాల విషయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత అసెస్‌మెంట్ నంబర్ తప్పుగా వస్తోంది. మ్యూటేషన్ సమయంలో ఇంటినంబర్ వద్ద బ్లాక్ తప్పుగా చూపిస్తోంది. సమస్యను జిల్లా ఉన్నతాధికారులతోపాటు రాష్ట్ర స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. – శ్రీనివాస్, డీఎల్‌పీవో, కామారెడ్డి

బోనమెత్తిన బాన్సువాడ



బాన్సువాడలో బోనాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ప్రజలు



బోనాలు ఎత్తుకున్న పోచారం, కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : బాన్సువాడ పట్టణం ఆదివారం బోనమెత్తింది. పట్టణంలోని బేతాళ స్వామి ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయ బోనాల పండుగను ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. పాత బాన్సువాడ చావిడి, సంగమేశ్వర కాలనీ, కొత్త బాన్సువాడ పెద్ద హనుమాన్ ఆలయం, హరిజనవాడ నుంచి అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో భక్తులు ఆలయం వద్దకు వచ్చారు. నల్ల పోచమ్మకు బోనాలు సమర్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనం సమర్పించారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గడిరెడ్డి, సూర్యకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు దూరం.. ప్రజలకు భారం

- భీమ్‌గల్‌లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటుకు విజ్ఞప్తులు
- ఆర్మూర్‌లో నిర్వహణతో ఇక్కట్లుపడుతున్నామని ఆవేదన
- భీమ్‌గల్ పరిధి మండలాల్లో 2,500కు పైగా క్రిమినల్ కేసుల పెండింగ్

ఆర్మూర్: జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటు కోసం భీమ్‌గల్‌తోపాటు ఐదు మండలాల ప్రజలు ప్రయత్నాలు చేస్తున్నారు. క్రిమినల్, సివిల్ కేసుల విషయంలో ఆర్మూర్ కోర్టుకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. సిరికొండ, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాలకు అందుబాటులో ఉండేలా భీమ్‌గల్‌లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు 2007లో మంజూరైంది. కాగా, ఆ కోర్టును ఆర్మూర్‌లో ఏర్పాటు చేయడంతో సమస్య మొదలైంది. ప్రజలు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, పోలీసులు వివిధ కేసుల విషయంలో ఆర్మూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దూరభారం, సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. దీంతో కోర్టును సాధించుకునేందుకు భీమ్‌గల్ ప్రాంతీయులు ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై నివేదిక సమర్పించాలంటూ 2023 నవంబర్ 8న ఆర్మూర్ కోర్టుకు ఆదేశాలు వచ్చాయి. 500 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉంటేనే కొత్తగా కోర్టు మంజూరు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ, భీమ్‌గల్ పరిధిలోని ఆరు మండలాలను కలిపి సుమారు 2,500 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండడంతోపాటు భీమ్‌గల్ మున్సిపాలిటీగా ఏర్పడింది. ఈ గణాంకాల ప్రకారం భీమ్‌గల్‌లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి. ఈ విషయాలన్నీ తెలంగాణ రాష్ట్ర లా సెక్రటరీకి నివేదిక రూపంలో సమర్పించి భీమ్‌గల్‌కు కోర్టు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఆర్మూర్ పట్టణంలోని కోర్టు

ఇబ్బందిగా ఉంది



ఆర్మూర్ కోర్టులో గృహహింస, మెయింటినెన్స్ కేసు నడుస్తోంది. నేను ఆర్మూర్‌కు వెళ్లాలంటే 62 కి.మీ ప్రయాణించాలి. మా గ్రామం నుంచి ఆర్మూర్‌కు బస్సు సౌకర్యం కూడా లేదు. ఇబ్బందిగా మారుతోంది. అదే కోర్టు భీమ్‌గల్‌లో ఉంటే మాలాంటి వారికి సౌకర్యంగా ఉండేది.
– భూక్య లత, పాకాల, సిరికొండ మండలం

భీమ్‌గల్‌లో ఏర్పాటు చేయాలి



ఆర్మూర్ కోర్టులో క్రిమినల్ కేసులకు నేను హాజరుకావాల్సి ఉంది. మా గ్రామం నుంచి ఆర్మూర్ కోర్టు 53కి.మీ. బస్సు సౌకర్యం సరిగా లేని గ్రామం నుంచి ప్రతినెలా ఆర్మూర్‌కు వెళ్లడం కష్టమవుతోంది. భీమ్‌గల్‌లో కోర్టును ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.
– లకావత్ గణేశ్, కోనాపూర్, కమ్మర్‌పల్లి మండలం

సరైన నిర్ణయం తీసుకోవాలి



మా గ్రామం నుంచి ప్రతినెలా 64 కిలోమీటర్లు ప్రయాణించి ఆర్మూర్ కోర్టుకు వెళ్లాల్సి వస్తోంది. కేసుల్లో ఉన్న వారే కాకుండా ఉద్యోగులు, న్యాయవాదులకు కూడా దూరభారమవుతోంది. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి.
– భూక్య మోహన్, మానాల శివారులోని తండా, కమ్మర్‌పల్లి మండలం

ప్రభుత్వం స్పందించాలి



సివిల్ కేసుల విషయంలో ఆర్మూర్ కోర్టుకు రావడం ఇబ్బందిగా ఉంది. మాకు సౌకర్యంగా ఉండేలా భీమ్‌గల్‌కు కోర్టును మంజూరు చేస్తే దానిని ఆర్మూర్‌లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం స్పందించి భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలి.
– మోజీరామ్, తూంపల్లి, సిరికొండ మండలం

క్లుప్తంగా

నాడు సర్పంచ్‌గా.. నేడు వ్యవసాయ క్షేత్రంలో..

- యాడారంలో రెండు ఎకరాల్లో మామిడి మొక్కల సాగు



బీబీపేట: సర్పంచ్‌గా ఐదేళ్లు గ్రామానికి సేవ చేసిన సర్పంచ్ ప్రస్తుతం వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని యాడారం గ్రామ మాజీ సర్పంచ్ చెన్నమనేని వెంకట్‌రావు గత ఐదేళ్లుగా గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. అయితే సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో అప్పటికే రైతు అయిన వెంకట్‌రావు కొత్త ఆలోచనతో ఇంటి పక్కనే ఉన్నటువంటి రెండు ఎకరాల్లో మామిడి మొక్కలతో పాటు కొబ్బరి మొక్కలు పెంచుతున్నాడు. ఉదయమే తనకున్న ఐదు ఎకరాల వరి పొలం వద్దకు వెళ్లి పనులు చేసుకొని వచ్చి వెంటనే మామిడి మొక్కలకు నీళ్లు అందిస్తున్నాడు. ప్రభుత్వం నుంచి సబ్సిడీలో డ్రిప్ పరికరాలు అందకపోవడంతో మండుతున్న ఎండల్లో సైతం ప్రతి మొక్కకు కాలువల ద్వారా నీళ్లు అందిస్తున్నాడు. సర్పంచ్‌గా ఉన్నన్ని రోజులు సైతం తన వ్యవసాయ పనులు చేసుకుంటూనే గ్రామ పాలన అందించాడు. పదవీకాలం ముగియడంతో పొలం బాట పట్టాడు. ఇంటి పక్కనే కావడంతో భార్యాభర్తలు అటు కూరగాయలు సైతం పండిస్తున్నారు.

ఇంటి నుంచే 'ఎల్‌ఆర్‌ఎస్'

- సందిగ్ధంలో దరఖాస్తుదారులు
- సులువుగా ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించవచ్చు
- ఈనెల 31 వరకు గడువు

కామారెడ్డి టౌన్ : అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)–2020 పేరిట ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈనెల 31వ తేదీ వరకు తుది గడువుకు ఉండటంతో ఇందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో కాస్త సందిగ్ధత నెలకొంది. రుసుం చెల్లింపు కోసం ఎక్కడికి వెళ్లాలి, రుసుం ఎంత చెల్లించాలనే విషయాలు తెలియడం లేదు. సాంకేతిక అవగాహన ఉండి స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ అందుబాటులో ఉంటే ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన రుసుం చెల్లింపులు చాలా సులభంగా చేయొచ్చు.

ఇలా చేయండి..

గూగుల్ సెర్చ్‌లో ఎల్‌ఆర్‌ఎస్–2020 అని టైప్ చేయాలి. అక్కడ వెల్‌కమ్ టు లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్‌పై క్లిక్ చేయాలి. తెలంగాణ డాట్ గౌట్ డాట్ ఇన్ (lrs.telangana.gov.in) వెబ్‌సైట్ లోకి వెళ్లాలి. అక్కడ హోమ్ పేజీలో సిటిజన్ లాగిన్‌ను ఎంచుకోవాలి. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు సమయంలో మనం ఇచ్చిన ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలి. ఓటీపీ కోసం అభ్యర్థించిన వెంటనే మన ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని అక్కడ నమోదు చేసి వ్యాలిడేట్ చేసుకోవాలి. వివరాలు చూసుకుని ముందుకు సాగేందుకు ప్రొసీడ్‌ను క్లిక్ చేయాలి. సెల్ఫ్ డిక్లరేషన్‌కు సంబంధించిన అన్ని అంశాలను మనం అంగీకరిస్తూ పేమెంట్ బటన్‌ను క్లిక్ చేయాలి. అక్కడ క్యూఆర్ కోడ్‌ను చూపించే బటన్‌ను నొక్కాలి. ఆ తర్వాత మన ఫోన్ నంబర్‌ను నమోదు చేయాలి. కంటిన్యూ అండ్ పే క్లిక్ చేయాలి. ఫోన్‌పే లేదా గూగుల్ పే ఆధారంగా అక్కడ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రుసుం చెల్లించాలి. చెల్లింపులు విజయవంతమైతే రసీదును డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత అధికారులు విచారణ చేపట్టి అన్ని సక్రమంగా ఉంటే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేస్తారు. నిషేధిత, ప్రభుత్వ భూములు, తప్పుడు డాక్యుమెంట్ తదితర సమస్యలుంటే దరఖాస్తును తిరస్కరిస్తారు. ఇది వరకే చెల్లింపులు చేసిన రుసుం మొత్తంలో 10 శాతం డబ్బులు కట్ చేసుకుని తిరిగి ఖాతాలో జమ చేస్తారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు


జుక్కల్‌లో..

కామారెడ్డి టౌన్/నిజాంసాగర్ : భగత్‌సింగ్ వర్ధంతిని ఆదివారం పట్టణంలో విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దేవునిపల్లిలోని భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, విద్యార్థిసేనా, ఏఐఎస్ఎఫ్, టీపీటీఎఫ్‌ల ఆధ్వర్యంలో, జుక్కల్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

జుక్కల్‌లో బంజార భవన్ నిర్మిస్తాం

పిట్లం/నిజాంసాగర్/బిచ్కుంద : సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో గిరిజనులు నడవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. పిట్లంలోని సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మండల బంజార నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. భోగ్ బండార్‌లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలో బంజారా భవన్ నిర్మిస్తామన్నారు. జుక్కల్ మండలం బంగారుపల్లి, దోస్త్‌పల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. దోస్త్‌పల్లి గ్రామం నుంచి జుక్కల్ మండల కేంద్రం వరకు బీటీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

బిచ్కుంద క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. షాదీఖానాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో బంజారా, కాంగ్రెస్ నాయకులు రమేష్‌దేశాయ్, సాయాగౌడ్, మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, నాగ్‌నాథ్, గంగాధర్, నాగ్‌నాథ్ పటేల్, సాహిల్, గౌస్, పాషా,అజీం, ఖలీల్, నౌషా నాయక్, తుకారం పాల్గొన్నారు.


పిట్లంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు


ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

అ'పూర్వ' కలయిక

వారంతా పూర్వ విద్యార్థులు. ఏళ్ల క్రితం పదో తరగతి చదివి ఎక్కడెక్కడో స్థిరపడిన వారు.. మళ్లీ ఇప్పుడు ఓ చోట కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. గత మధురస్మృతులను నెమరువేసుకొని పరవశించిపోయారు. ఈ అపూర్వ ఘట్టానికి ఆదివారం ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలు వేదికలయ్యాయి.


వేల్పూర్ హైస్కూలులో సమ్మేళనానికి హాజరైన 1976-77 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

వేల్పూర్‌లో 48ఏళ్ల తర్వాత..

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1976–77 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ బ్యాచ్‌కు 48 ఏళ్లు పూర్తికాగా, 2027లో 50 ఏళ్ల ఉత్సవం కుటుంబాలతో కలిసి జరుపుకోవాలని నిర్ణయించారు.

బీబీపేటలో 43 ఏళ్ల తర్వాత..

బీబీపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1981–82 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల నిర్మాణ దాత సుభాష్ రెడ్డిని ఆహ్వానించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో చాలా మంది మనుమలు, మనుమరాళ్లతో కలిసి పాల్గొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు.

ముప్కాల్‌లో ఉల్లాసంగా..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.

నగరంలో ఆటాపాటలు..

నిజామాబాద్ అర్బన్: బ్రహ్మపురిలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయ 1997–98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆర్యవైశ్య పట్టణ సంఘం కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆటాపాటలతో సందడి చేశారు. ఆనాటి పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సేనాపతి వెంకట కుమారాచార్య, ప్రసాద్, గంగాకిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.


బీబీపేటలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1981-82 పూర్వ విద్యార్థులు


బాల్కొండలో గురువులతో పూర్వ విద్యార్థులు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నగరంలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయ పూర్వ విద్యార్థులు

తెయూ విద్యార్థికి 'సాహిత్య పురస్కారం'



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ విద్యార్థి రాజు సాహిత్య పురస్కారం అందుకున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనంలో రాజు పాల్గొన్నారు. తను రచించిన ఉగాది పండుగ కవితా రచనను సమ్మేళనంలో విన్పించగా వెన్నెల సాహితీ సంగమం ప్రతినిధులు, సాహితీప్రియులు, కవులు, రచయితలు రాజును ప్రత్యేకంగా అభినందించారు. కవితా రచనను ప్రోత్సహిస్తూ 'సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య పురస్కారం', ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పురస్కారాన్ని అందుకున్న రాజును తెయూ తెలుగు అధ్యయన శాఖ ప్రొఫెసర్ డీ కనకయ్య, అధ్యాపకులు అభినందించారు.

గుండెపోటుతో ఏవో విజయ్‌కుమార్ మృతి



ఎల్లారెడ్డి: స్థానిక ఆర్డీవో కార్యాలయం ఏవోగా బదిలీ అయిన విజయ్‌కుమార్ (59) ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వర్తించిన విజయ్‌కుమార్ ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఏవోగా బదిలీ అయినట్లు వారు తెలిపారు. శనివారం బాన్సువాడ కార్యాలయం నుంచి రిలీవ్ కాగా సోమవారం ఎల్లారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో జాయిన్ కావాల్సి ఉంది. ఆదివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. విజయ్‌కుమార్ మృతికి రెవెన్యూ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

క్రైం కార్నర్

అబుదాబిలో రోడ్డు ప్రమాదం.. తొర్తివాసి మృతి



మోర్తాడ్(బాల్కొండ): దుబాయ్ దేశంలోని అబుదాబి నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన ఈర్గల గంగాధర్(44) మరణించినట్లు అతని సన్నిహితుల ద్వారా తెలిసింది. ఉపాధి కోసం అబుదాబిలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న గంగాధర్.. శనివారం బైక్‌పై డ్యూటీకి వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్ర గాయాలపాలైన అయన అక్కడికక్కడే మృతి చెందాడు. గంగాధర్‌కు భార్య, కూతురు, కొడుకు, తల్లి ఉన్నారు. గతంలో గీతా కార్మికునిగా పనిచేసిన గంగాధర్ ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టాడు. విధి వక్రీకరించి ప్రమాదంలో మృత్యువాత పడడంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతదేహాన్ని త్వరగా రప్పించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి..

బోధన్‌రూరల్: సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులోని చెరువు ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన రమేశ్ ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా గ్రామ శివారులోని చెరువులో కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకేజీ.. ఒకరికి తీవ్రగాయాలు

రెంజల్(బోధన్): ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పైపు లీకేజీ కావడంతో మంటలు వ్యాపించి దంపతులకు గాయాలైన ఘటన రెంజల్ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మోతీలాల్ ఇంట్లో మధ్యాహ్నం వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పైపు లికేజీ అయ్యి రెగ్యులేటర్ పేలింది. దీంతో మంటలు వ్యాపించి మోతీలాల్‌కు తీవ్రగాయాలు కాగా, భార్య లతకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలికపై లైంగిక దాడి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన వేణు అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామన్నారు. గ్రామంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ విచారణ నిర్వహించినట్లు తెలిపారు.

ఆస్తి పన్ను చెల్లించని దుకాణాల సీజ్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో ఆస్తి పన్ను చెల్లించని పలు దుకాణాలను ఆదివారం బల్దియా అధికారులు సీజ్ చేశారు. అనిల్ టాకీస్ రోడ్డులోని కేకే సూపర్ మార్కెట్, లక్ష్మి అపార్ట్‌మెంట్‌లోని దుకాణ సముదాయాలతోపాటు మరో దుకాణ సముదాయాన్ని సీజ్ చేశారు. దు కాణాదారులు బల్దియాకు రూ.3,16,629ల ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించకపోతే దుకాణాలను సీజ్ చేస్తామని, ఇంటికి తాగునీటి సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని గోర్గల్ గ్రామ శివారులో ఆదివారం ఎస్సై శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి ద్విచక్రవాహనం నడుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాపం బాలుడిని ఆదుకోరూ!

- లుకేమియాతో బాధపడుతున్న నిర్విన్ తేజ్
- ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు


నిర్విన్ తేజ్

డొంకేశ్వర్(ఆర్మూర్): పాఠశాల తరగతి గదిలో ఉండాల్సిన సమయంలో ఆస్పత్రిలో చేరి మహమ్మారి వ్యాధితో పోరాడుతున్నాడు బాలుడు నిర్విన్ తేజ్. డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామానికి చెందిన మోతె అశోక్, గంగామణిల కుమారుడు నిర్విన్ తేజ్ తొండాకూర్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇటీవల సైకిల్ పైనుంచి పడడంతో కాలుకు పెద్ద గాయం తగిలింది. చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు రక్త పరీక్షలు చేశారు. అందులో తెల్లరక్త కణాలు ఎక్కువగా ఉండటంతో మరిన్ని పరీక్షలు చేయగా బాలుడికి (అక్యూట్ మైలోయిడ్ లుకేమియా) బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఎంఎంజే ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారం రోజులుగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోజుకు కొన్ని యూనిట్ల రక్తం అవసరం అవుతోంది. ఇప్పటికే రూ. నాలుగైదు లక్షల వరకు ఖర్చు అయింది. ఇంకా పదిహేను రోజుల వరకు వైద్యం అందించాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. తల్లిదండ్రులది నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు స్తోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి తన కొడుకును కాపాడాలని వేడుకుంటున్నారు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు..

తండ్రి: మోతె అశోక్
బ్యాంకు ఖాతా నంబరు: 75010100025228
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : UBIN0817503
ఫోన్ పే నంబర్: 9705612610 (గంగామణి, తల్లి)

గేదెను తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా

- ఒకరి దుర్మరణం



మాక్లూర్: అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడగా ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం నందిపేట మండలం సీహెచ్ కొండూర్ శివారులో చోటు చేసుకుంది. నందిపేట పోలీసుల కథనం ప్రకారం.. వెల్మల్ గ్రామానికి చెందిన చిన్నోల్ల సాయిలు(51) నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడి వద్ద వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. నిత్యకృత్యంలో భాగంగా తన ట్రాక్టర్‌పై వెల్మల్ నుంచి పంచగుడిలోని పొలానికి వెళుతున్నాడు. సీహెచ్ కొండూర్ వద్ద ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో దాన్ని తప్పించబోయే ప్రయత్నంలో ట్రాక్టర్ బోల్తా కొట్టింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న చిన్నోల్ల సాయిలుకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్సులో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయిలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు విద్యార్థిని ఎంపిక



జక్రాన్‌పల్లి : మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన గన్న వర్షిణి భారత సాఫ్ట్‌బాల్ అండర్–15 సబ్‌జూనియర్ జట్టుకు ఎంపికైంది. ఈనెల 25 నుంచి 30 వరకు తైవాన్‌లో జరిగే ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో వర్షిణి పాల్గొననుంది. అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టు తరపున వర్షిణి ప్రాతినిథ్యం వహిస్తుండడంతో మునిపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. మాజీ సర్పంచ్ ముస్కు చిన్న సాయిరెడ్డి ఆదివారం వర్షిణిని సన్మానించారు. ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు నరేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం దోస్త్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదివారం హౌసింగ్ డీఈఈ గోపాల్, ఎంపీడీవో శ్రీనివాస్ ముగ్గులు వేయించారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం, భవనాలకు సంబంధించి మార్కింగ్ వేయించారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.